ప్రొటోకాల్ పాటించాలి

- ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై వివక్ష వద్దు
- అభివృద్ధిలో అందరం భాగస్వాములు కావాలి
- ఎంపీపీ కందుల జాను



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దాచేపల్లి : ప్రభుత్వ అధికారులు ప్రొటోకాల్ పాటించాలని, ప్రతిపక్ష ప్రతినిధులపై వివక్ష చూపించవద్దని ఎంపీపీ కందుల జాను పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ జాను అధ్యక్షతన శుక్రవారం జరిగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వ అధికారులు వివక్ష చూపిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, అభివృద్ధి పనులు, సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రతిపక్ష సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కూడా సంప్రదించాలని ఎంపీపీ జాను చెప్పారు. గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం నిర్వహించే సమావేశాలు, సభలకు కూడా ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలని, ప్రజాప్రతినిధుల ప్రొటోకాల్ పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని ఆయన పేర్కొన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు కలిసికట్టుగా పనిచేస్తే అభివృద్ధిలో అగ్రభాగంలో ఉండవచ్చునని ఆయన చెప్పారు. ప్రభుత్వ, మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని, ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జాను సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, సూపర్‌డెంటెంట్ సాంబశివ రావు, ఈవోపీఆర్డీ నాగెండ్ల రత్నం, డిప్యూటీ తహసీల్దార్ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెంటచింతల ఏపీఓగా పోలిమిరెడ్డి కోటిరెడ్డి



రెంటచింతల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రెంటచింతల ఏపీఓగా పాలిమిరెడ్డి కోటిరెడ్డిని నియమిస్తూ డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కారెంపూడి ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న కోటిరెడ్డిని రెంటచింతల ఏపీఓగా, ప్రస్తుతం ఇక్కడ ఏపీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.జయచంద్ర కుమార్‌ను కారెంపూడి ఏపీఓగా బదిలీ చేస్తూ పీడీ జోసఫ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

28 నుంచి ఉచిత గుండె పరీక్షలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా 28 నుంచి మూడు రోజుల పాటు ఉచిత గుండె పరీక్షలు నిర్వహించనున్నట్లు శ్రీ దత్త గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ గార్లపాటి కృష్ణకాంత్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గటల వరకు శిబిరం జరుగుతుందని వెల్లడించారు. 2 వేల రూపాయల విలువ చేసే బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు, కన్సల్టేషన్ సేవలు ఉచితంగా లభిస్తాయని పేర్కొన్నారు. వివరాలకు 6303682376, 7893149751 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మార్పీకే పురుగుమందులు అమ్మాలి



రెంటచింతల: ఎమ్మార్పీకే ఎరువులు, పురుగుమందులు అమ్మాలని, అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ ఉన్న ఎరువులను బ్లాక్ చేస్తే అటువంటి దుకాణదారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు, పురుగు మందుల దుకాణ నిర్వాహకులు షాపులలో ఉన్న ప్రతి ఎరువుకు, పురుగు మందులకు ఖచ్చితంగా రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. నిబంధనల మేరకు అమ్మకాలు జరపాలని స్పష్టం చేశారు.

నేడు రామాలయంలో పూజలు

దాచేపల్లి : తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు ప్రాయశ్చిత్తం కలిగేలా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు స్థానిక రామాలయంలో ఉదయం 9 గంటల నుంచి పూజలు జరుగుతాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



పిడుగురాళ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ చెప్పారు. పట్టణంలోని 4వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు చుట్టు పక్కల చెత్త వేయటం కానీ, మురుగు నీటి కాలువల్లో చెత్త పడవేయటం వలన మురుగు నీరు రోడ్లపై పారుతోందని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు చెత్తను ఇవ్వాలని తెలియజేశారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని, నీరు పారేలా మళ్లీ మున్సిపల్ సిబ్బందితో చర్యలు చేపడతామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దూదేకుల కాశీం సైదా, వార్డు కన్వీనర్ కిరిటీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో స్వచ్ఛతాహీ సేవ



కారెంపూడి: స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలోని దేవాలయ ప్రాంగణాలను శుభ్రం చేసే కార్యక్రమాలను పంచాయతీ కార్మికులు నిర్వహించారు. కారెంపూడిలో వీర్ల గుడి ఆవరణ, అలాగే ఇతర దేవాలయాలు పరసరాలను కార్మికులు ఊడ్చి చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అలాగే వివిధ గ్రామాలలో చర్చిలు, దేవాలయాలు, మసీదులు ఇతర ప్రార్థనా స్థలాల పరిసరాలను శుభ్రం చేయించే పనులను ఆ గ్రామాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చేపట్టారు.

ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండాలి



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు కోటేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

దాచేపల్లి : భావి పౌరులకు ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి చెప్పారు. మండలంలోని మాదినపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చింతకింది వెంకట కోటేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉత్తమ ఉపాధ్యాయుడు కోటేశ్వరరావును శుక్రవారం సన్మానించారు. కోటేశ్వరరావు ఉపాధ్యాయ వృత్తికి మంచి పేరు తీసుకువచ్చేలా పనిచేశారని, ఈ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులల్లో ఎక్కువ మంది ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించేలా కృషి చేశారని రామిరెడ్డి గుర్తు చేశారు. సన్మానగ్రహీత కోటేశ్వరరావు మాట్లాడుతూ తాను చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలను అనుభవించి శ్రద్ధగా చదువుకుని ఈ స్థాయికి వచ్చానని, తనకు ఎంతోమంది ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు క్రమశిక్షణ కలిగిన విద్యను అందించి వారిని ఉన్నతమైన స్థానాల్లో ఉండేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జీ. శాంతరావు, ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, స్వర్ణగౌరి, మునిమ్మ, శ్రీలక్ష్మీ, నాగమల్లేశ్వరి, శివనాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మించాలి



నరిశేటి వేణుగోపాల్

సత్తెనపల్లి: స్థానికంగా ప్రస్తుతం ఉన్న వివిధ కోర్టుల భవనాలు శిథిలావస్థలో, మరికొన్ని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో వేర్వేరు చోట్ల ఉన్నాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ అన్నారు.. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కక్షి దారులు, న్యాయవాదులు, న్యాయవాది గుమాస్తాలు, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం తక్షణమే అన్ని కోర్టులు ఒకే చోట ఉండేలా 'నూతన కోర్టు కాంప్లెక్స్'(భవనాలు) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తాలూకా సెంటర్‌లోని పాత కోర్టు స్థానంలోనే నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మించడానికి, విస్తరించడానికి తగిన స్థలం అందుబాటులో ఉందన్నారు. పాత తహసీల్దార్, ఉప ఖజాన అధికారి కార్యాలయాల స్థానంలో ప్రత్యామ్నాయంగా ఇప్పటికే నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం జరిగి అందులోనే కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయన్నారు. పాత తహసీల్దార్ కార్యాలయం నిరుపయోగంగా ఉందన్నారు. ట్రెజరీ కార్యాలయాల నిర్మాణం పూర్తి చేసేందుకు ఇప్పటికే శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. పాత కోర్టు ప్రాంగణంతో పాటు పాత తహసీల్దార్, ట్రెజరీ, ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాల స్థలాలను సమీకరిస్తే 'నూతన కోర్టు కాంప్లెక్స్' నిర్మించడానికి సరిపడా స్థలం అందుబాటులోకి వస్తుందన్నారు. కోర్టు భవనాలు సముదాయానికి కావలసిన పరిపాలన అనుమతులు, నిధులు మంజూరుకు న్యాయశాఖ, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయులు, సత్తెనపల్లి బార్ అసోసియేషన్ కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రతి గ్రామంలో పూజలు చేద్దాం

వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌బాబు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరం శనివారం పూజలు నిర్వహిద్దామని వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ నాయకులు, పల్నాడు హాస్పిటల్ డాక్టర్ చింతలపూడి అశోక్‌బాబు అన్నారు. ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై బాబు చేసిన ఆరోపణలను తిప్పికొట్టి తిరుమల ప్రతిష్టను కాపాడేలా గురజాల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పూజ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక



కారెంపూడి: స్థానిక ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం విద్యార్థినులు స్కూల్ గేమ్స్‌లో మాచర్ల నియోజకవర్గం తరుపున జిల్లా స్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీఈటీ బి.ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అథ్లెటిక్స్‌తోపాటు యోగా, 100, 200, 400, 1,500 మీటర్ల పరుగు పందెం, అలాగే 3 కి.మీ. పరుగులో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు విద్యార్థినులు అర్హత సాధించారని పేర్కొన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాలలో పలువురు విద్యార్థినులు ఎంపికయ్యారని పీఈటీ పేర్కొన్నారు.

సత్తెనపల్లిలో రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు

సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆరుగురు బదిలీ కాగా.. కేవలం ఇద్దరిని మాత్రమే నియమించారు. నలుగురి భర్తీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఉన్న ఉద్యోగులపై పని భారం పడనుంది. మండల డిప్యూటీ తహసీల్దారుగా ఎన్.రవి కుమార్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిలకలూరిపేట నుంచి ఆయన ఇక్కడికి రానున్నారు. ప్రస్తుత డీటీ బి.రాజేంద్ర ప్రసాద్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. సత్తెనపల్లి పౌర సరఫరాల డీటీ కె.అరుణాదేవిని డీఎస్‌ఓ కార్యాలయ స్పెషల్ డీటీగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఎవరిని నియమించలేదు. అలాగే డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికల విభాగం) ఆర్. వెంకటేశ్వర్లు నాయక్‌ను కారంపూడి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కూడా ఎవరిని పంపలేదు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.ఆదియ్యను నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కూడా ఎవరిని నియమించలేదు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో రెండు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీనియర్ అసిస్టెంట్‌గా బి.సుబ్బారావును స్థానిక ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కలెక్టరేట్ నుంచి షేక్ జిలాని బాధ్యతలు స్వీకరించనున్నారు. సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేస్తున్న కె.వెంకటేశ్వర్లను అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు.

కొత్త చట్టాల రద్దు కోసం న్యాయవాదుల నిరసన



సత్తెనపల్లి: న్యాయవాదులు తమ హక్కులు కాపాడుకునేందుకు ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త చట్టాల రద్దు కోసం ఉద్యమం చేయాలని న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలోని న్యాయ దేవత విగ్రహం ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమంలో రెండో రోజు శుక్రవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. న్యాయవాదులు రెండో రోజు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రవి, మన్నెం వెంకటేశ్వరావు, నాగూర్ బాబు, న్యాయవాదులు పూజల వెంకట కోటయ్య, కళ్ళం వీర భాస్కర్ రెడ్డి, కాకర్ల నాగవెంకటహరి బాబు, దాసరి జ్ఞాన రాజ్‌పాల్, నరిశేటి వేణుగోపాల్, కొల్లా వెంకటేశ్వరావు, పోతల రవికుమార్, బూతుకూరి రామిరెడ్డి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, చావల బాలకోటయ్య, నల్లిబోయిన ఆంజినేయులు, బొక్క సంగీతరావు, ఆకుల నాగార్జున, ఉడుముల విద్యాసాగర్‌రెడ్డి, భరత్ ఉన్నారు.

భగత్‌సింగ్ త్యాగం మరువలేనిది



రెంటచింతల: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ ప్రాణత్యాగం మరువలేనిదని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో భగత్‌సింగ్ జయంత్యుత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసరావు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సూరపరెడ్డి పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు ఎస్. భాగ్యమేరి, పి.సత్తాజ్‌బేగం, బి.పిచ్చయ్య, జె.కృష్ణనాయక్, ఎస్‌కే. సుభాని, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి

దుర్గి: మండల పరిధిలోని ముటు కూరు గ్రామంలో వ్యక్తిపై గొడ్డలితో దాడి చేయడంతో తీవ్ర గాయాలు పాలైన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేనుకు ఎస్సీ కాలనీకి చెందిన ఏరువ లింగేశ్వరరావు(30)పై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేయటంతో తలకు తీవ్ర గాయం అయింది. కుటుంబ సభ్యులు, బంధువులు క్షతగాత్రుడిని మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఐఆర్ 30 శాతం ప్రకటించాలి

సత్తెనపల్లి: దసరా సందర్భంగా పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని శుక్రవారం కోరారు. గత పీఆర్‌సీ, డీఏ, బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు.

విచారణ నుంచి డీఎస్పీని తప్పించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నేతలు

నరసరావుపేట: చిలకలూరిపేట రూరల్ మండలం యడవల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల ఏడుకొండలు ఇంటిని కూల్చి, కులం పేరుతో దూషించి అవమానపర్చిన నిందితులపై బాధితులు పెట్టిన ఎస్‌సీ, ఎస్‌టీ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న డీఎస్పీని ఈ కేసు పరిధి నుంచి తప్పించి మరొక నిజాయితీగల అధికారితో విచారణ చేపించి బాధితులకు న్యాయం చేయాలని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె. కృష్ణ డిమాండ్ చేశారు.

శుక్రవారం పట్టణంలోని ఎన్జీవోహోంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రగశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి, గుంటూరు నగర కార్యదర్శి ఎన్.పోతురాజు, జిల్లా కమిటీ సభ్యులు ఏడుకొండలు, శిఖినం సాంబయ్య, చైతన్య గ్యాస్ వర్కర్ యూనియన్ నాయకులు చలపతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏం పాపం చేసిందని కూల్చారు?!

- పూర్తిగా నేలమట్టమైన ఎన్‌జీవో పార్కు ధ్యానవేదిక
- ప్రహరీని సైతం వదలిపెట్టని వైనం
- మాకేం తెలియదని మున్సిపల్ అధికారుల బుకాయింపు
- గతంలో మున్సిపల్ కమిషనర్ క్వార్టర్‌కు కేటాయించిన స్థలం
- కౌన్సిల్‌లో ఈ మేరకు తీర్మానం
- విధ్వంసకారులపై ఫిర్యాదు చేయని వైనం



ఉద్యానవనంలో ధ్యాన వేదిక పూర్తిగా తొలగించి అడ్డుగా ఉన్న పార్కు గోడను సైతం పడేసిన దృశ్యం

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కలెక్టర్, ఎస్పీలు ఉండగా అధికారంలో ఉన్న టీడీపీ వర్గీయులు అధికారులను పట్టించుకునే పరిస్థితి కన్పించటం లేదు. అధికారులకు ఏమాత్రం తెలియకుండా, ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఎన్‌జీవో కాలనీలోని కోడెల ఉద్యానవనం (మున్సిపల్ పార్కు)లోని ధ్యాన వేదికను తొలగించటంతో పాటు పార్కు గోడను సైతం 15 అడుగుల మేర కూల్చివేశారు. దీనిపై మున్సిపల్ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నా యి. ముందుగా అనుమతి లేకుండా వేదిక తొలగించటం, గోడను సైతం తొలగించిన సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడటం గమనార్హం.

క్వార్టర్ స్థలంలో ధ్యాన వేదిక

ధ్యాన వేదిక ఉన్న స్థలం మున్సిపల్ కమిషనర్ కోసం నిర్మించాల్సిన క్వార్టర్ స్థలమనే విషయం వెలుగులోకి వచ్చింది. 2000 నుంచి 2004 మధ్య జోగేశ్వరమ్మ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఎన్‌జీవో కాలనీలో అభయాంజనేయ స్వామి దేవాలయంకు ఎదురుగా ఉన్న ధ్యానవేదికను తొలగించిన ఆరుసెంట్ల స్థలాన్ని మున్సిపల్ క్వార్టర్ నిర్మించేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అయితే క్వార్టర్ నిర్మాణం జరగలేదు. ఆ తర్వాత దానిపక్కనే ఉన్న స్థలాన్ని పార్కుకు కేటాయించటంతో ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని సైతం పార్కులో కలిపేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఈ స్థలంలో పార్కుకు వచ్చే వారు ఆసనాలు, ధ్యానం చేసుకునేందుకు వేదికను నిర్మించారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో అనేక కాంట్రాక్ట్ పనులు చేసి చేతినిండా సంపాదించిన కాలనీకి చెందిన టీడీపీ వర్గీయుడు ఒకరు ఇప్పుడా వేదికను తొలగించి దాని స్థానంలో తన సొంత నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేసేందుకు పూనుకొని దివంగత స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించిన వేదికను తొలగించారు. ఈ చర్యను అదే ప్రాంతానికి చెందిన టీడీపీలోని కొంతమంది వ్యతిరేకిస్తున్నారు.

ఫిర్యాదు చేయడంపై ఆలోచిస్తున్నాం

సంఘటనా స్థలాన్ని ఉదయమే పరిశీలించి వచ్చా. మాకు తెలియ చేయకుండానే జరిగిపోయింది. మా వద్ద అనుమతులు ఏమీ తీసుకోలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పరిశీలిస్తున్నాం. ఇటువంటి పనులు ఎవరూ చేయకూడదు.

–ఎం.జస్వంతరావు, కమిషనర్

భూములకు నష్టపరిహారం చెల్లిస్తాం

జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనూరే

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, మాచవరం గ్రామాల గుండా నకరికల్లు అడ్డరోడ్డు నుండి చీరాల ఓడరేవు వరకు నిర్మించనున్న నాలుగులైన్ల (167ఏ) జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న యజమానులతో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంగా రిజిస్ట్రేషన్ వ్యాల్యూపై అధికంగా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. 81.6 కిలోమీటర్ల రహదారి నిర్మించనున్నట్లు వారు తెలిపారు.

రైతుల భూములకు సంబంధించిన యాజమాన్య హక్కు పత్రాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూములు కోల్పతున్న రైతులు తమ భూములకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. రైతుల అభ్యర్థనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో నరసరావుపేట రెవెన్యూ డివిజన్ అధికారి సరోజిని, తహసీల్దార్ బండి నిర్మల, సర్వేయర్‌లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నడవండి.. గెలుచుకోండి..!



వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మహాత్మా గాంధీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తారీకున కోడెల శివప్రసాద్ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 5 కె వాక్‌లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో 5కె వాక్ బహుమతులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హృదయ సంబంధిత వ్యాధులపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, ఆయా సమస్యలపై డాక్టర్ల సలహాలు, సూచనలను పాటించాలని ఆయన కోరారు. మహాత్మా గాంధీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాస రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

–నరసరావుపేట

ఇసుక లారీలకు ఆహ్వానం..బస్సులకు నిషేధం



పెదమద్దూరు బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న ఇసుక లారీ

ప్రఖ్యాత పర్యాటక కేంద్రం అమరావతి. విజయవాడ నుంచి రావాలంటే అధ్వాన రోడ్డులో ఆపసోపాలు తప్పవు. దీనికి తోడు పెదమద్దూరు వద్ద వాగుపై లో–లెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జిని పరిశీలించిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు బ్రిడ్జిపై నుంచి రాకపోకలను నిషేధించారు. కానీ, తుళ్లూరు మండలం నుంచి అమరావతి వైపు భారీ ఇసుక లారీలు ఈ బ్రిడ్జిపై నుంచి రెండు రోజులుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇది గమనించిన మండల ప్రజలు భారీ ఇసుక లారీలకు లేని నిషేధం.. ఆర్టీసీ బస్సులకెందుకని ప్రశ్నిస్తున్నారు. కేవలం బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని బోర్డు ఏర్పాటు చేసి.. ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు.

–అమరావతి

30 వరకు ఈ–కేవైసీ గడువు

నకరికల్లు: ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలకు ఈ–కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి, మిర్చి, పత్తి, శనగ, అపరాలు సాగుచేస్తున్న రైతులు రైతు సేవ కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. వెంటనే ఈ–కేవైసీ పూర్తి చేయాలన్నారు. దీంతో ప్రభుత్వం రైతులకు అందజేసే సంక్షేమ పథకాలకు అర్హత పొందాలని పేర్కొన్నారు.